

ప్రకృతి సేద్యం దిశగా..
కొందరు రైతులు ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు పండిస్తున్నారు.
వివరాలు 8లో ▸



అంజన్న నామస్మరణ
బీచుపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణ శనివారం భక్తులతో కిటకిటలాడింది.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.2 /24.4
వాతావరణం
ఎండ తీవ్రత తగ్గుముఖం పట్టింది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

50 మంది విద్యార్థులు గైర్హాజరు

వనపర్తి టౌన్: జిల్లాలో పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా అసిస్టెంట్ ఎగ్జామినర్ గణేష్ తెలిపారు. శనివారం ఐదోరోజు జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు రెండు పరీక్షకేంద్రాల్లో మొత్తం 383 మంది విద్యార్థులకుగాను 333 మంది హాజరుకాగా.. 50 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.

'రాష్ట్ర సదస్సును జయప్రదం చేద్దాం'



అమరచింత: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం 'గ్రామీణ ఉపాధిహామీ చట్టం.. అమలు సవాళ్లు' అనే అంశంపై జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు నాయకులు, ఉపాధి కూలీలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సంఘం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ పిలుపునిచ్చారు. శనివారం సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పట్టణంలో విడుదల చేసి మాట్లాడారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి వెంకట్, కేరళ ఎంపీ శివదాసన్ హాజరవుతారని వెల్లడించారు. రాష్ట్రంలో 54 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. 1.24 కోట్ల మంది కూలీలు ఉపాధిహామీ పనులు చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో 20 పనులు మాత్రమే చేయాలన్న కేంద్ర నిబంధనను సవరించాలని, రోజువారీ కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 200 పని దినాలు కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, రాజు, తిరుమల శ్రీనివాసులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని విచారణ



పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ గోదాం ఎదుట కాలిపోతున్న గన్నీబ్యాగులు (ఫైల్)

పెబ్బేరు గోదాంలో అగ్ని ప్రమాదం జరిగి రెండునెలలు పూర్తి

- సుమారు రూ.10 కోట్ల ప్రజాధనం బుగ్గిపాలు
- నేటికీ బాధ్యులెవరో తేల్చని అధికారులు
- ఇన్‌చార్జ్ అధికారులు ఉండటంతోనే జాప్యమా?

వనపర్తి: పెబ్బేరు గోదాంలో అగ్ని ప్రమాదం జరిగి 70 రోజులవుతున్నా.. నేటికీ విచారణ ఓ కొలిక్కిరావడం లేదు. ఘటనా స్థలంలో కనిపించిన అనుమానాస్పద అంశాలెన్నో ఉద్దేశపూర్వకంగా రూ.కోట్ల విలువగల లక్షల గన్నీబ్యాగులు కాల్చి బూడిద చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బీమా వర్తిస్తుందనే ధీమాలో అధికారులున్నా.. లెక్కల్లో తేడాలను కప్పిపుచ్చుకునేందుకు పౌరసరఫరాలశాఖలోని కొందరు అధికారులు, మిల్లర్ల ముసుగులో మరికొందరు రాజకీయ నాయకులు ఈ ఘటనకు ప్రధాన కారకులనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పోలీసు అధికారులు విచారణలో ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 12.83 లక్షల గన్నీబ్యాగులు రూ.10 కోట్ల ప్రభుత్వ ఆస్తి బుగ్గిపాలైన ఘటనపై ప్రభుత్వ అధికారులు ఇంత ఉదాసీనతగా విచారణ చేపట్టడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉండవచ్చనే అనుమానాలు లేకపోలేదు.

ఇన్‌చార్జ్‌ల పాలనతోనేనా..?

జిల్లా పౌరసరఫరాలశాఖ రెండు విభాగాల్లోనూ ఇన్‌చార్జ్ అధికారులతో పనులు సాగుతున్నాయి. ఇక్కడి రెగ్యులర్ డీఎస్‌ఓను నారాయణపేటకు డిప్యుటేషన్‌పై పంపిన ఉన్నతాధికారులు.. మహబూబ్‌నగర్ డీఎస్‌ఓ, డీఎం కార్పొరేషన్లను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. దీంతో కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. రూ.10 కోట్ల ప్రభుత్వ ఆస్తి మంటల్లో కాలిపోయినా.. విచారణ వేగవంతం చేయాలనే ఒత్తిడి ఏ శాఖలో లేకపోవటం గమనార్హం. ప్రజాధనాన్ని నష్టం కలిగించిన అంశంపై బాధ్యులెవరో తేల్చాలనే ధోరణి సంబంధిత శాఖల అధికారుల్లో కనిపిచటం లేదు.

ఎఫ్ఎస్ఎల్ నివేదిక రాకనే..



నిప్పంటించేందుకు ఉపయోగించిన రసాయనాలను గుర్తించేందుకు ఎఫ్ఎస్ఎల్ విభాగం అధికారులను రప్పించాం. వారు వచ్చి కొన్ని నమూనాలు సేకరించారు. వారిచ్చే నివేదిక ఆధారంగా విచారణ చేపట్టి త్వరలోనే బాధ్యులెవరనేది తేల్చుతాం. కాలిపోయిన సుమారు 12.83 లక్షల గన్నీ బ్యాగుల విలువ రూ.8 కోట్లకు పైగా ఉండొచ్చు. – రాంబాబు, విచారణ అధికారి, కొత్తకోట సీఐ

తెరుచుకొని ఉన్న కిటికీ సంగతేంటీ?

పెబ్బేరు వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఉన్న గోదాంలో గన్నీబ్యాగులు నిల్వ చేశారు. 2024, ఏప్రిల్ 1న గోదాంలో మంటలు చెలరేగిన సమయంలో కిటికీ తెరుచుకుని ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కిటికీలో నుంచే అగ్గి పెట్టేందుకు ఏదైనా కెమికల్ ఉపయోగించి ఉంటారనే అనుమానాలు స్థానికుల్లో వెల్లువెత్తాయి. ఈ కోణంలో విచారణ చేస్తున్నారా.. ఇప్పటి వరకు శోధించిన అంశాలేంటి అనే విషయంపై ఇటు పోలీసు అధికారులుగాని, ఘటనకు బాధ్యులు ఎవరూ అనే విషయం తెలుసుకునేందుకు అటు పౌరసరఫరాలశాఖ అధికారులు ఎందుకు ఆసక్తి కనబర్చడం లేదనే ప్రశ్నలకు ఏ శాఖ అధికారులతోనూ సమాధానం లేదు.

3,263 కేసులు పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత తదితరులు

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత

వనపర్తి టౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో 3,263 పరిష్కారమైనట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్ అనంతరం ఆమె మాట్లాడారు. భరణం, బ్యాంకు రుణాలు, ఇన్సూరెన్స్ తదితర కేసులు, సివిల్, క్రిమినల్ కేసులు, డ్రంకెన్ డ్రైవ్, చిన్న చిన్న తగాదాలు, ప్రిలిటిగేషన్, ట్రాఫిక్ చలానా కేసులు పరిష్కారమయ్యాయన్నారు. రాజీయే రాజ మార్గమని.. కక్షిదారులు తమ కేసులు పరిష్కరించుకోవాలని, లేదంటే కోర్టు చుట్టూ తిరగాల్సి ఉంటుందని చెప్పారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని, జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తులు బి.శ్రీలత, జానకి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌కుమార్‌యాదవ్, న్యాయవాదులు, బ్యాంకు మేనేజర్లు, టెలిఫోన్ సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించారు.. పట్టించుకోరు

వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో అరకొర వైద్యసేవలు



వీపనగండ్లలోని సామాజిక ఆరోగ్య కేంద్రం

- వేధిస్తున్న వైద్యుల కొరత
- ఉన్న కొద్దిపాటి పరికరాలు నిరుపయోగంగానే..
- అంబులెన్స్, జనరేటర్ లేక రోగుల అవస్థలు

వీపనగండ్ల: మండల కేంద్రంలో రూ.3 కోట్లతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అరకొర వైద్యసేవలు అందుతున్నాయి. రెండేళ్ల కిందట నాటి వైద్య, ఆరోగ్యశాఖమంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే ఆర్భాటంగా ప్రారంభించారు. కాని నేటికీ కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, సరిపడా సిబ్బంది, అవసరమైన పరికరాలు సమకూర్చకపోవడంతో సరైన వైద్యసేవలు అందక ఆస్పత్రి ఉన్నా.. ప్రయోజనం చేకూరడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సౌకర్యాలు, సిబ్బంది నియామకాలు చేపట్టి పూర్తిస్థాయిలో సేవలందించాలని కోరుతున్నారు.

ఖాళీల భర్తీలేవి..?

ఆస్పత్రిలో ఒక సివిల్ సర్జన్, ఇద్దరు డిప్యూటీ సివిల్ సర్జన్లు, ఐదుగురు డ్యూటీ డాక్టర్లు, ఇద్దరు ఫార్మసిస్టులు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్సులు, డాటా ఎంట్రీ సిబ్బంది విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కాని నేటికీ ఈ పోస్టులను భర్తీ చేయడం లేదు.

అంబులెన్స్ కేటాయింపులో వివక్ష..

ఆస్పత్రి ప్రారంభించిన నాటినుంచి అంబులెన్స్ కేటాయించాలని కోరినా ఉన్నతాధికారులు స్పందించడం లేదు. గతంలో ఈ ఆస్పత్రికి మంజూరైన అంబులెన్స్‌ను కూతవేటు దూరంలో ఉన్న పాన్‌గల్ మండలానికి కేటాయించారు. కొత్తగా ఏర్పడిన చిన్నంబావిలో ఆస్పత్రి లేకపోవడంతో అత్యవసర సమయాల్లో సుమారు 40 కిలోమీటర్ల దూరం నుంచి ఈ ఆస్పత్రికి రావాల్సి ఉంటుంది. అంబులెన్స్ లేక పలువురు ఆస్పత్రి వద్దే మృతిచెందిన సందర్భాలు ఉన్నాయి.

విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలోనూ నిర్లక్ష్యం..

ఆస్పత్రికి మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చిన అధికారులు సర్వీస్ వైర్ లేదన్న కారణంతో నెలలుగా కనెక్షన్ ఇవ్వడం లేదు. ఇక తప్పని పరిస్థితుల్లో అరకొర విద్యుత్ సౌకర్యంతో ఆస్పత్రి నిర్వహణ కొనసాగుతోంది.



మూలకు చేరిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం

నిరుపయోగంగా సామగ్రి..

ఆస్పత్రిలో 14 మంది స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా.. ఇటీవల ఏర్పడిన ప్రభుత్వం 10 మందిని కేటాయించింది. విధుల్లో చేరిన కొంతకాలానికే వీరిలో ముగ్గురు రాజకీయ నాయకుల అండతో పట్టణాలకు బదిలీ చేయించుకున్నారు. రూ.లక్షలు వెచ్చించి తెచ్చిన ఎక్స్–రే యంత్రం టెక్నీషియన్ లేక మూలకు చేరింది. అలాగే చిన్నపాటి మరమ్మతుకు గురైన అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం బాగు చేయించకపోవడంతో నిరుపయోగంగా మారింది. జనరేటర్ లేకపోవడంతో విద్యుత్ లేని సమయంలో రోగుల అవస్థలు వర్ణనాతీతం.

నాలుగు మండలాలకు..

వీపనగండ్ల మండలంలోని 14 గ్రామాలు, చిన్నంబావి మండలంలోని 17, పెంట్లవెల్లి, పాన్‌గల్ మండలాల్లోని సుమారు 40 గ్రామాల ప్రజలకు ఈ ఆస్పత్రి అందుబాటులో ఉంటుంది. అన్ని సౌకర్యాలు కల్పిస్తే మారుమూల ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

వసతులు సమకూర్చాలి..



మారుమూల ప్రాంత ప్రజలకు అనువుగా ఉన్న 30 పడకల ఆస్పత్రిపై వివక్ష వీడి అన్నిరకాల వసతులు సమకూర్చాలి. చికిత్సకు అవసరమైన పరికరాలు, మహిళా వైద్యులను వెంటనే నియమించాలి. ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత పాలకులు, అధికారులదే. – మండల కృష్ణయ్య, మాజీ సర్పంచ్, బొల్లారం

సేవలు మెరుగుపర్చాలి..



గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే కుటుంబ నియంత్రణ, బటన్‌హోల్ ఆపరేషన్లు చేసేవారు. ఆస్పత్రి స్థాయి 30 పడకలకు పెంచామని చెప్పడంతో మహిళలకు మేలు చేకూరుతుందని భావించాం. కానీ సరైన సేవలు అందక కిశోర బాలికలు, పసిపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర నిధులు విడుదల చేసి వైద్యసేవలు మెరుగుపర్చాలి. – ఎల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్, వీపనగండ్ల

ఉన్నతాధికారులకు విన్నవిస్తాం..



ఆస్పత్రికి పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. వైద్యుల భర్తీ ప్రక్రియలో ఈ ఆస్పత్రికి డాక్టర్లు రానున్నారు. పరికరాలతో పాటు వసతులు మెరుగుపర్చాలని ఉన్నతాధికారులకు విన్నవిస్తాం. – డా. ప్రియాంక, ఇన్‌చార్జ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, వీపనగండ్ల

శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు

బిజినేపల్లి: నందివడ్డెమాన్‌లోని జ్యేష్ఠాదేవి సమేత శనేశ్వరుడికి శనివారం భక్తులు తిలతైలాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి భక్తులతో హారతి, అభిషేకం, ప్రదక్షిణలు చేయించారు. అనంతరం శివుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు ఉమ్మయ్య, శాంతికుమార్ పాల్గొన్నారు.



గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహణకు సర్వం సిద్ధం

రీజినల్ కో–ఆర్డినేటర్ డా. చంద్రశేఖర్



జిల్లాకేంద్రంలోని సీవీరామన్ జూనియర్ కాలేజీ పరీక్ష సెంటరను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

వనపర్తి: జిల్లాలో ఆదివారం నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం పలు పరీక్ష కేంద్రాలను పరిశీలకులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంలో 15, కొత్తకోటలో రెండు మొత్తం 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, పరిశీలకులు, డిపార్ట్‌మెంట్ అధికారులు, రూట్ ఆఫీసర్లకు పలు దఫాల్లో శిక్షణనిచ్చామని.. ఎక్కడా ఏ చిన్న లోపం తలెత్తకుండా పరీక్షల నిర్వహణకు సన్నద్ధమైనట్లు వివరించారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగుతుందని.. జిల్లాలో 4,843 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు నిర్వహణ ఉంటుందని చెప్పారు. అభ్యర్థులను గంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తామని, ఈసారి బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తుండటంతో నిర్ణీత గడువులోగా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఒక్క నిమిషం నిబంధన కచ్చితంగా అమలు చేస్తామని.. సమయం ముగిసిన తర్వాత కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. అభ్యర్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని, బంగారం వస్తువులను సైతం ఇంటివద్దే ఉంచాలని సూచించారు. కేంద్రాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది సైతం సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని నిబంధనల్లో పేర్కొన్నట్లు తెలిపారు. మెడికల్ ఎమర్జెన్సీ మినహా ఏ ఇతర కారణాలతో అభ్యర్థులను గడువుకు ముందుగా బయటకు పంపించడం సాధ్యం కాదన్నారు. అభ్యర్థుల కోసం ఆర్టీసీ సమయానుగుణంగా బస్సులు నడపనున్నట్లు వివరించారు. అభ్యర్థులు తీసుకొచ్చిన వాహనాలను కేంద్రాల ఆవరణల్లో నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల ఆవరణల్లో ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్, ఇంటర్‌నెట్ దుకాణాలు మూసి ఉంచాలని ఇదివరకే అధికారులు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

ఫిట్'లెస్' బస్సులు

సామర్థ్య పరీక్షలకు ముందుకు రాని ప్రైవేట్ పాఠశాలల బస్సులు

- ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 30 శాతానికి మించని వైనం
- మరో మూడురోజుల్లో అన్నింటికి చేయడం కష్టమే..
- గడువులోగా చేసుకోవాలని సూచిస్తున్న ఆర్టీఏ అధికారులు
- ఈ నెల 12 నుంచి విద్యాసంస్థల పునః ప్రారంభం

పాలమూరు: పిల్లలు బడికి వెళ్లడం ఎంత ముఖ్యమో.. తిరిగి ఇంటికి రావడం కూడా అంతే ముఖ్యం. ఇందుకు పాఠశాల యాజమాన్యాలు చిన్నారులకు భద్రతపరమైనా భరోసా ఇవ్వాలి. పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు రూ.లక్షలు ఖర్చు పెట్టి ప్రైవేట్‌లో చదివిస్తున్నారు. బాధ్యతగా ఉండాల్సిన ఆ పాఠశాలల యాజమాన్యాలు బస్సుల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కాలం చెల్లినవి.. సామర్థ్యం లేని వాహనాల్లో పిల్లలను పాఠశాలలకు చేరవేస్తున్నాయి. దీంతో వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోంది. పర్యవేక్షించాల్సిన తనిఖీ అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. మే 15 నుంచి జూన్ 1 వరకు ప్రైవేట్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 1,264 స్కూల్ బస్సులు ఉంటే వాటిలో కేవలం 358 మాత్రమే ఫిట్‌నెస్ పరీక్ష చేయించగా.. మరో 906 బస్సులు రాలేదు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభం కావడానికి కేవలం మూడు రోజులే ఉండటంతో ఆలోగా పరీక్షలు చేయడం కష్టసాధ్యమే. కాగా.. మహబూబ్‌నగర్ జిల్లాలో గతేడాది ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న 25 స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం స్కూల్ బస్సులు 1,264
ఇప్పటి వరకు ఫిట్‌నెస్ పరీక్షలు చేసినవి 358
ఇంకా చేయాల్సినవి 906
జిల్లాలో గతేడాది కేసు నమోదు చేసిన బస్సులు 25
స్కూల్ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులు (సుమారు) 5 లక్షలపైనే..

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

జిల్లా	మొత్తం బస్సులు	ఫిట్‌నెస్ చేసినవి	చేయాల్సినవి
మహబూబ్‌నగర్	442	173	269
నారాయణపేట	129	30	99
నాగర్‌కర్నూల్	243	56	187
వనపర్తి	226	61	165
గద్వాల	224	38	186


నిత్యం 5 లక్షలపైనే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులను తరలించేందుకు 1,264 బస్సులు ఉన్నాయి. వీటన్నింటి ద్వారా నిత్యం 5 లక్షల మంది వరకు విద్యార్థులను విద్యాసంస్థలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బస్సులన్నింటికీ ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు ఏటా ఆర్టీఓ దగ్గర ఫిట్‌నెస్ పరీక్షలు జరిపి అనుమతి పత్రాలు పొందాల్సి ఉంటుంది. కానీ, పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అర్హత పత్రాలు తీసుకోవాల్సిన కొందరు పాఠశాలల యాజమాన్యాలు మరమ్మతు ఇతర కారణాలతో పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ పరీక్షలు చేయిచుకోవడం లేదు. విద్యాసంస్థల బస్సులకు ప్రత్యేకంగా పసుపు రంగు గుర్తు కేటాయించడంతోపాటు రక్షణ, సౌకర్యం కోసం పలు నిబంధనలు రూపొందించింది. విద్యాసంస్థల బస్సులన్నీ నిబంధనల మేరకు వసతులు కల్పించి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఫిట్‌నెస్ పరీక్షలుపూర్తి చేసుకోవాలి. బస్సుల నిర్వహణకు సంబంధించి విద్యార్థుల పూర్తి సంరక్షణ బాధ్యత తమదేనంటూ పాఠశాల యాజమాన్యాలు రవాణా శాఖకు హామీ పత్రం సమర్పించాల్సి ఉండగా.. పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు.

నిబంధనలకు విరుద్ధంగానే..

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్నాయి. అభం శుభం తెలియని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అటెండెంట్ లేకుండానే బస్సులు తిప్పడం, ఒక రూట్‌లో వెళ్లే బస్సును మరో రూట్‌లో నడపడం ఇలా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాల జారీకి కఠిన నిబంధనలు జారీ చేసింది. రిప్రజెంటేటివ్ బై డిజిగ్నేషన్, మొబైల్ నంబర్, విద్యాసంస్థ ఈ మెయిల్ ఐడీ, వెబ్‌సైట్ అడ్రస్ నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత యూజర్ నేమ్, పాస్‌వర్డ్ నమోదు చేస్తే రవాణా శాఖ కార్యాలయం నుంచి సమాచారం అందుతుంది. బస్సు వివరాలు, అటెండెంట్, డ్రైవర్ వివరాలు, వారి ఫొటోలు సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఏ రూట్‌లో బస్సు తిరుగుతుంది.. ఆ బస్సులో ప్రయాణించే విద్యార్థుల వివరాలు ప్రత్యేకంగా నమోదు చేయాలి.

చర్యలు తీసుకుంటాం..



ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోవడానికి ఈ నెల 12 వరకు అవకాశం ఉంది. స్కూల్స్ ప్రారంభమైన తర్వాత ఫిట్‌నెస్ లేకుండా బస్సు రోడ్డుపై తిరిగితే సీజ్ చేస్తాం. అలాగే 15 ఏళ్లు పైబడిన బస్సులు సైతం తిరగడానికి అవకాశం లేదు. అనుమతి లేకుండా పాఠశాల బస్సులు నడిపినా.. నిబంధనలు విస్మరించినా కఠిన చర్యలు తప్పవు. పాఠశాల బస్సుల నిబంధనల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. విద్యార్థుల సంరక్షణకు ప్రభుత్వ సూచనలన్నింటినీ పాఠశాలల యాజమాన్యాలు కచ్చితంగా పాటించి సహకరించాలి. – వాసుదేవరావు, ఇన్‌చార్జ్ డీటీసీ, మహబూబ్‌నగర్

ఘనంగా ఆరుద్ర పూజలు

కొత్తకోట రూరల్: పరమ శివుడి జన్మనక్షత్రం ఆరుద్రను పురస్కరించుకొని మండలంలోని కానాయపల్లి శివారు దత్త కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో ఆలయంలోని శివలింగానికి పంచామృత అభిషేకం, ఏకదశ రుద్రాభిషేకం తదితర పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.



అభిషేకం చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

పిడుగు పాటుకు గొర్రెల కాపరి మృతి


మాళప్ప (ఫైల్)

మాగనూర్: మండలంలోని వర్కూర్‌కు చెందిన కుర్వ మాళప్ప (55) పిడుగు పాటుకు గురై మృతిచెందిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మాళప్ప తన గొర్రెలను కర్ణాటకలోని రాయచూర్ జిల్లా అడవిసూర్ సమీపంలో మేతనకు తీసుకెళ్లాడు. శనివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో మంద వద్ద నిద్రిస్తున్న మాళప్పపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మాళప్పకు భార్య, కుమారుడు ఉన్నారు.

పొలంలో యువ రైతు..


బోయ రాజు (ఫైల్)

గద్వాల క్రైం: పొలం వద్ద ఓ యువ రైతు మృతిచెందిన ఘటన గద్వాల మండలం గుంటిపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోయ రాజు (24) భార్య సంధ్యతో కలిసి శుక్రవారం పొలానికి వెళ్లారు. సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులు మెరవడంతో వ్యవసాయ పరికరాలను భద్రపర్చి పశువులను కట్టేసి వస్తానని.. ఇంటికి వెళ్లాలని భార్యకు సూచించాడు. రాత్రి 9 గంటలైనా భర్త ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువులతో కలిసి సంధ్య పొలానికి వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. తనతో పాటే ఇంటికి వచ్చి ఉంటే ప్రాణాలతో ఉండేవాడని భార్య కన్నీంటి పర్యంతమైంది. పిడుగు పాటుకు గురై మృతిచెంది ఉండవచ్చని.. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు తిరుపతయ్య పరామర్శించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

రైలు నుంచి జారి పడిన వ్యక్తికి గాయాలు



మానవపాడు: రైలు నుంచి జారిపడిన వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి మానవపాడు మండల శివారు ప్రాంతంలో చోటుచేసుకుంది. ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ప్రేమ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం, మామల్పురానికి చెందిన పన్నీరు సెల్వం హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లేందుకు వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో జనరల్ బోగిలో ప్రయాణం చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కదులుతున్న రైలు నుంచి జారి కిందపడ్డాడు. పన్నీరు సెల్వంతో పాటు ఉన్న శామ్యూల్ సెల్వన్ గమనించి రైలు కర్నూల్ స్టేషన్‌కు చేరుకున్న తరువాత అక్కడి స్టేషన్ మాస్టర్‌కు విషయం తెలియజేశాడు. మానవపాడు శివారు ప్రాంతంలో పన్నీరు సెల్వం గాయాలతో పడి ఉండగా.. శనివారం ఉదయం గుర్తించి కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలియజేశారు. ఈ తనిఖీల్లో జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 33 గొర్రెపిల్లలు మృతి



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామ శివారులో గొర్రెల మందను మేపడానికి తీసుకెళ్లగా.. కంచెలోని 33 గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేయడంతో గొర్రెలు మృతిచెందాయని గొర్రెల కాపరులు శనివారం తెలియజేశారు. పుల్లూరులోని పంట పొలాల్లో ఆపిన గొర్రెల మందను ఉదయాన్నే మేపడానికి తీసుకెళ్లారు. వాటి గొర్రె పిల్లలను కంచెలో ఉంచి వెళ్లగా.. కుక్కలు అందులోకి చొరబడి 33 గొర్రె పిల్లలపై దాడి చేసి చంపేశాయని గొర్రెల యజమానులు గోవిందు, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, రాజు తెలియజేశారు. దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు తెలియజేశారు.

చెక్‌పోస్టులో ఆవుల పట్టివేత

బాలానగర్: బాలానగర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో మూడు ఆవులను పోలీసులు స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించారు. ఆదివారం మండల కేంద్రంలోని జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ నిర్వహించారు. జడ్చర్ల కావేరమ్మపేట నుంచి బొలెరో వాహనంలో తరలిస్తున్న మూడు అవులను స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తిరుపాజీ తెలిపారు. ఆవులను తరలిస్తున్న డ్రైవర్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి సేద్యం దిశగా..


అయిజ మండలం ఉప్పల శివారులో సాగుచేసిన ఆయిల్‌పాం తోట

- ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులపై రైతన్న ఆసక్తి
- గోఆధారిత సాగుకు ప్రాధాన్యం
- జీవాల పెంపుతో అదనపు ఆదాయం

శాంతినగర్: కొన్నేళ్ల కిందట ఎక్కడ చూసినా ప్రకృతి సేద్యమే. గోఆధారిత ఎరువులతో పండించిన ఆరోగ్యకర ఉత్పత్తులతో రైతుల కుటుంబాలతో పాటు ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉండేది. కాలక్రమేణా రసాయన ఎరువుల వాడకం పెరగడంతో పర్యావరణ కాలుష్యంతో పాటు వ్యవసాయ పొలాలు సారం కోల్పోయ్యాయి. పదుల సంఖ్యలో రసాయన ఎరువులు వేయనిదే పంట చేతికొచ్చే పరిస్థితి లేకుండా పోయింది. రసాయనాలతో పండించిన ఆహార ఉత్పత్తులతో ప్రజలు అనారోగ్యం బారిన పడి ఆస్పత్రులపాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి సాగుపై రైతన్నలు ఆసక్తి పెంచుకుంటున్నారు. ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. పండ్ల తోటల పెంపకంలో ఎలాంటి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల పిచికారి లేకుండా సాగుబడికి ఉపక్రమించారు. దేశవాళి గోవులు, గొర్రెలను కొనుగోలుచేసి, తోటల్లో వదులుతున్నారు. పశువుల పేడ, మూత్రంతో పండ్ల తోటలను పెంచుతున్నారు.

అదనపు ఆదాయం..

పండ్ల తోటల్లో గోవుల పెపకంతో రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. దేశవాళి రకాలైన ఒంగోలు జాతి పశువులను పెంచుతూ.. గోఆధారిత సేద్యం చేయడంతో పాటు పాలు, కోడె దూడలను అమ్ముకుంటూ రూ. లక్షలు గడిస్తున్నారు. అదేవిధంగా గొర్రెల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించారు. తోటల్లో పెరిగే పిచ్చి మొక్కలు, గడ్డిని వాటికి అందిస్తూ, తోటలకు సేంద్రియ ఎరువు అందిస్తున్నారు. 10నుంచి 50 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచుతున్న రైతులు 100 నుంచి 200 వరకు గొర్రెలను పెంచుతున్నారు.

- పొలాల్లో లభించే పిచ్చిమొక్కలు, ఆకులు, అలుములతో వానపాముల పెంపకం చేపడుతున్నారు. నిరుపయోగంగా ఉన్న చెత్తాచెదారాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన తొట్లలో వేసి వానపాములు పెంచుతున్నారు. వాటి వల్ల లభించే కంపోస్టు ఎరువును పండ్ల మొక్కలకు అందిస్తున్నారు.

జీవామృతం పిచికారి..

పశువుల మూత్రంతో తయారయ్యే జీవామృతాన్ని పండ్ల తోటలకు పిచికారి చేస్తున్నారు. దీనివల్ల సూక్ష్మపోషకాల లోపం మొక్కలకు ఉండదని రైతులు చెబుతున్నారు. పంటలకు హాని కలిగించే వివిధ రకాల పురుగులు, క్రిమీకీటకాలు నశిస్తాయని పేర్కొంటున్నారు.


పిచికారికి సిద్ధంగా ఉన్న జీవామృతం

వ్యవసాయాధికారుల అవగాహన..

ప్రకృతి సేద్యంపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల గ్రామ, మండల స్థాయిలో చేపట్టిన రైతు సదస్సుల్లో పచ్చిరొట్ట ఎరువులు, పశువుల పేడ, జీవామృతం తయారీ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు.

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం..



ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే బాగుంటుంది. ఆవులు కొనుగోలు చేయడానికి, షెడ్లు వేసుకోడానికి సబ్సిడీలు అందిస్తే ఆర్గానిక్ పంటల సాగుపై రైతులు మరింత ఆసక్తి చూపుతారు. రైతులందరూ గోఆధారిత వ్యవసాయంపై దృష్టి సారిస్తే, నాణ్యమైన ఫలాలు, పంట ఉత్పత్తులతో ఆరోగ్యంగా ఉంటారు.

– ప్రహ్లాదరెడ్డి, రైతు, ఉప్పల, అయిజ మండలం

అంజీర పండ్లకు డిమాండ్..



సేంద్రియ ఎరువులు, ప్రకృతితో మమేకమైన ఆకులు, మజ్జిగ, తంగేడి ఆకులు, ప్రకృతి సిద్ధమైన పదార్థాలతో తయారుచేసిన జీవామృతంతో అంజీర తోట సాగుచేస్తున్నాను. తోటకు ఎలాంటి చీడపీడలు ఆశించడం లేదు. దీంతో పండ్లు నాణ్యతగా ఉంటున్నాయి. ఫోన్ ద్వారా ఆర్డర్‌లు ఇచ్చి చాలామంది కొనుగోలు చేస్తున్నారు.

– చాణేశ్వర్‌రెడ్డి, రైతు, జిల్లెడుదిన్నె, వడ్డేపల్లి మండలం

మామిడి మొక్కలు బాగా పెరుగుతున్నాయి..



మూడేళ్లగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. అందుకోసం దేశవాళి ఆవులు కొనుగోలుచేసి, పొలం వద్ద షెడ్ ఏర్పాటుచేసుకున్నాను. సేంద్రియ ఎరువులతో మామిడి చెట్లు బాగా పెరుగుతున్నాయి. మొక్కలకు డ్రిప్ ద్వారా ఎరువులు అందిస్తున్నాను. వేపనూనె, కంపోస్టు ఎరువులు సబ్సిడీపై అందిస్తే బాగుంటుంది.

– నాగులపల్లి నాగేశ్వరరావు, రైతు, నవరోజ్ క్యాంపు, అయిజ మండలం

జిల్లాలో ఆర్గానిక్ పంటల సాగు ఇలా..

జోగుళాంబ గద్వాల జిల్లాలోని మల్దకల్, వడ్డేపల్లి, అయిజ, ఎర్రవల్లి మండలాల్లోని శాసన్‌పల్లి, జిల్లెడుదిన్నె, ఉప్పల గ్రామాల్లో పలువురు రైతులు ఆర్గానిక్ పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి సేద్యంపై ప్రత్యేక దృష్టి సారించి.. పండ్ల తోటలు, వరి, జొన్న, కొర్రల తదితర పంటలను సాగు చేస్తున్నారు. పంటల సాగులో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకాన్ని పూర్తిగా నిలిపివేశారు. కేవలం ఆవు పేడ, గొర్రెల ఎరువులు, గోమూత్రం పిచికారితో పంటలు పండిస్తున్నారు. ఉప్పల శివారులో రైతు ప్రహ్లాదరెడ్డి ఆయిల్‌పాం తోట, నవరోజ్ క్యాంపులో చిట్టిబాబు, జిల్లెడుదిన్నె శివారులో రైతు చాణేశ్వర్‌రెడ్డి అంజీర పండ్ల తోటలతో రూ.లక్షల ఆదాయం పొందుతున్నారు. శాసన్‌పల్లిలో మరికొందరు రైతులు జామ, బత్తాయి, అంజీర తోటలను సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్నారు.


వానపాములతో తయారుచేసిన కంపోస్టు ఎరువు

మార్మోగిన అంజన్న నామస్మరణ


భక్తులతో కిక్కిరిసిన ఆలయం

ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ పరిసరాలు ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగాయి. నెలరోజుల పాటు జరిగే జాతరలో భాగంగా మూడవ శనివారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామికి పంచామృత అభిషేకం, ఆకుపూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో దాసంగాలు పెట్టారు.


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సనాతన ఆంగ్ల గ్రంథావిష్కరణ


సనాతన ఆంగ్ల గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మికవేత్త పీఎస్.ధర్మాధికారి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత ప్రభులింగంశాస్త్రి రచించిన సనాతన ఆంగ్ల గ్రంథాన్ని శనివారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఆవిష్కరించారు. ప్రముఖ న్యాయవాది, ఆధ్యాత్మికవేత్త పీఎస్.ధర్మాధికారి ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. సనాతన భారతీయ తత్త్వంపై ఇంగ్లిష్‌లో ప్రభులింగంశాస్త్రి గ్రంథాలను ఆవిష్కరించినట్లు తెలిపారు. భారతీయ ఆధ్యాత్మికతను ఆంగ్లంలో ప్రపంచానికి పరిచయం చేయడాన్ని ప్రశంసించారు. ఇంగ్లిష్ నాటకకర్తగా ప్రఖ్యాతగాంచిన షేక్స్‌పియర్‌పై భారతీయ ఆధ్యాత్మిక ప్రభావాన్ని ప్రమాణాలతో వివరించిన తీరు వీరి పరిశోధనా శక్తిని తెలియజేస్తుందన్నారు. అనంతరం రచయిత ప్రభులింగంశాస్త్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో షుభంగాజానై, సుభాష్‌చంద్ర భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

కారులో చెలరేగిన మంటలు

- తప్పిన పెను ప్రమాదం


జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న కారు

కొత్తకోట రూరల్: కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగగా.. అప్రమత్తమైన కారులోని వారు వెంటనే కిందికి దిగడంతో పెను ప్రమాదం తప్పింది. ఈఘటన కొత్తకోట మండలం పాలెం జాతీయ రహదారి–44 పెద్ద బ్రిడ్జి సమీపంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పూర్తి వివరాలిలా.. హైదరాబాద్‌కు చెందిన సురేష్ తన స్నేహితులైన పుల్లయ్య, వెంకటేశ్వర్‌రావుతో కలిసి తన సొంత కారులో కర్నూల్‌కు బయలుదేరాడు. సుమారు రాత్రి 8గంటల సమయంలో కొత్తకోట సమీపంలోకి రాగానే కారులో వైర్లు కాలిపోయిన వాసన రావడంతో వెంటనే అప్రమత్తమైన కారు యజమాని సురేష్ కారు నడుపుతున్న తన స్నేహితుడికి కారు ఆపమని చెప్పాడు. కారు ఆపిన వెంటనే ముగ్గురు కిందకు దిగారు. ఆకస్మాత్తుగా కారులో మంటలు చెలరేగాయి. ఏం జరిగిందో తెలుసుకొనేలోపు క్షణాల్లోనే కారు మంటల్లో తగులబడుతుండటంతో భయాందోళనకు గురయ్యాయి. స్థానికుల సహకారంతో కొత్తకోట ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా కారు అప్పటికే పూర్తిగా దగ్ధమైంది. కారులో మంటలు వ్యాప్తి చెందడంతో అటుగా వెళ్లే వారు తమ వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

జూరాల ఆనకట్టపై మొసలి కలకలం


జూరాల ప్రాజెక్టు రోడ్డుపై సంచరిస్తున్న మొసలి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఆనకట్టపై శుక్రవారం ఓ మొసలి కలకలం రేపింది. ప్రాజెక్టు కట్టపై ఉన్న రోడ్డుపై సంచరిస్తూ బాటసారులకు కనిపించింది. భయాందోళనకు గురైన వాహనదారులు కొంత సమయం ప్రాజెక్టు రోడ్డుపై ఆగి మొసలి కదలికలను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి జారుకోవడంతో వాహనదారులు వెళ్లిపోయారు. ఆ సమయంలో ప్రాజెక్టుపై కరెంటు కూడా లేకపోవడంతో వాహనదారులు తమ వాహనాల లైట్ల ద్వారానే కదలికలను గమనించారు. ప్రాజెక్టు రోడ్డుపై పూర్తిస్థాయిలో లైట్లు వెలిగేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

నిందితుడికి రిమాండ్


వివరాలు తెలుపుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో రెండు ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్లిన నిందుతుడిని శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా.. జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన శ్రీధర్ ఈ నెల 6న తన బైక్‌తో పాటు తన స్నేహితుడి బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్చి 24న రాత్రి బైక్ ఇంటి వద్ద ఆపి ఆయన హైదరాబాద్ వెళ్లారు. తిరిగి మూడు రోజుల క్రితం జూన్ 6న నారాయణపేటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వారిని అడగగా ఆయన స్నేహితుడు జయకృష్ణ బైక్ కూడా పోయిందని తెలిసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా, రంగారెడ్డి జిల్లా కుల్కచర్ల మండలం మరికల్‌కు చెందిన మంగళి యాదయ్య వాహనాలను ఎత్తుకెళ్లినట్లు విచారణలో తేలిందన్నారు. ఆయనను పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

జాతీయ స్థాయికి ఎంపిక




పెబ్బేరు రూరల్: ఈ నెల 11 నుంచి 15 వరకు రాజస్థాన్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని టార్గెట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉమాశంకర్ శనివారం తెలిపారు. తెలంగాణ సీనియర్ పురుషుల జట్టుకు పాతపల్లికి చెందిన లోకేష్, పట్టణానికి చెందిన పార్థసారథి ఎంపికై నట్లు తెలిపారు. క్రీడాకారులను పలువురు అభినందించారు.

నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి



ఫౌండేషన్ సీడ్ ట్యాగ్



సర్టిఫైడ్ సీడ్ ట్యాగ్


సర్టిఫైడ్ సీడ్ విత్తనాలు

అలంపూర్: నాణ్యమైన విత్తనాలతో పంట సాగు చేస్తే ఏ పంటలోనైనా అధిక దిగుబడి వస్తోంది. నాణ్యమైన విత్తనాలు నాలుగు రకాల్లో లభ్యమవుతాయని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచిస్తున్నారు. బ్రీడర్, సర్టిఫైడ్, ట్రూత్ ఫుల్ లేబుల్స్‌లో లభిస్తాయని పేర్కొంటున్నారు. ఇందులో ఏ రకాన్ని సాగు చేసినా విత్తనంగా మార్చుకోవచ్చు. వీటితో రైతులు విత్తన భారం తగ్గించుకోవడంతో పాటు తోటి రైతులకు అందించి అధిక రేటు పొందవచ్చు.

బ్రీడర్ విత్తనం

ఇది అన్ని రకాల విత్తనాలకు మూల విత్తనం. దీన్ని కంపెనీలు ఆయా బ్రీడర్ల పర్యవేక్షణలో పండిస్తారు. వ్యవసాయ పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు తయారు చేసేది ఇలాంటి విత్తనాలే. ఈ విత్తనం వంద శాతం జన్యు నాణ్యత కలిగి ఉంటుంది. బ్రీడర్ సీడ్‌కు బంగారు రంగు ట్యాగ్ వేస్తారు. సీడ్ ధర ఎక్కువ. రైతులకు రెండు కిలోలకు మించి ఇవ్వరు.

ఫౌండేషన్ విత్తనం

ఈ విత్తనాన్ని బ్రీడర్ విత్తనం నుంచి ఉత్పత్తి చేస్తారు. వివిధ విత్తనోత్పత్తి సంస్థలు, సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో పండిస్తారు. దాదాపు వంద శాతం జన్యు నాణ్యత ఉంటుంది. ప్రైవేట్ విత్తన కంపెనీలు వ్యవసాయ పరిశోధన స్థానాల నుంచి బ్రీడర్ విత్తనాలు తీసుకెళ్లి ఫౌండేషన్ విత్తనాన్ని తయారు చేస్తాయి. ఈ సీడ్‌కు తెలుపు రంగు ట్యాగ్ వేస్తారు.

సర్టిఫైడ్ (ధ్రువీకరించిన) విత్తనం

దీన్ని ఫౌండేషన్ విత్తనం నుంచి వేరుగా ఉత్పత్తి చేస్తారు. వివిధ సంస్థలు, రైతుల పొలాల్లో కూడా విత్తన పర్యవేక్షకుల సమక్షంలో పండించే అవకాశం ఉంటుంది. ఈ విత్తనానికి నీలి రంగు ట్యాగ్ వేస్తారు.

ట్రూత్ ఫుల్ లేబుల్ విత్తనం

సర్టిఫైడ్ విత్తనం నుంచి ఉత్పత్తి చేసిన ఈ విత్తనాన్ని విత్తన ధృవీకరణ సంస్థ ధృవీకరించాల్సి ఉంటుంది. అనంతరం ఆ విత్తనాలను ట్రూత్ ఫుల్ లేబుల్ కింద రైతులకు విక్రయిస్తారు. ట్రూత్ ఫుల్ లేబుల్ విత్తనానికి ఆకుపచ్చ రంగు ట్యాగ్ వేస్తారు.

వీటిని గమనించండి..

- కనీస మొలక శాతం, కనీస జన్యు స్వచ్ఛత, గరిష్ట తేమ శాతం తదితర వివరాలు చేసిన తర్వాతనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తన సంచిపై లేబుల్, సరిగా సీల్ లేకున్నా, విత్తనాలు కొనవద్దు.
- తేమ అధికంగా ఉన్న చోట, మిర్చి విత్తనాల దగ్గర, సిమెంట్, క్రిమి సంహారక మందులు, ఎరువుల సంచుల వద్ద, సూర్యరశ్మి తగిలే ప్రాంతాల్లో నిల్వ చేసిన విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
- అడ్వాన్స్‌గా విత్తనాలు బుకింగ్ చేయవద్దు. రాత్రికి రాత్రి విక్రయించే అపరిచిత వ్యక్తుల నుంచి కొనుగోలు చేయరాదు. అనుమానం వస్తే ఆయా వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి.

తాగునీటికి 20 క్యూసెక్కుల వినియోగం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో శనివారం నాటికి పూర్తిస్థాయి నీటి మట్టం 1,012 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. సమాంతర కాల్వ ద్వారా 27 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. అయితే, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

40 గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా

గోపాల్‌పేట: మోటార్లు మరమ్మతుకు గురవడంతో దాదాపు 40 గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. మండల కేంద్రమైన గోపాల్‌పేట నుంచి నిత్యం మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేది. అయితే, నీటిని పంపింగ్ చేసే రెండు మోటార్లు మరమ్మతుకు గురవుతుండడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడంలేదు. ప్రస్తుతం ఒక మోటారు మాత్రమే పనిచేస్తుంది. మరమ్మతుకు గురైన మోటార్లను సదరు కంపెనీ నుంచి మెకానిక్‌లు వచ్చి రిపేరు చేయాల్సి ఉండగా.. నేటికీ రాకపోవడంతో గ్రామాలకు మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ మొగులయ్యను వివరణ కోరగా.. ఆదివారం నీరు సరఫరా చేస్తామని చెప్పారు.

జెన్‌కోలో సామగ్రి చోరీ

ఆత్మకూర్: దిగువ జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని స్టోర్‌రూంలో సామగ్రి చోరీకి గురరైందని ఎస్ఐ నరేందర్ శనివారం తెలిపారు. ఏఈ వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు శివారులోని స్టోర్‌రూం గోదాంలో 6తేదీ రాత్రి తాళాలు పగలగొట్టి కాపర్, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. సుమారు రూ.95 వేలు విలువ చేసే సామగ్రి ఎత్తుకెళారని, ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


పరిశీలిస్తున్న ఎస్ఐ నరేందర్